జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 7 | మార్చి | 2026 • పేజీలు : 6




# ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 6 ,ప్రజాజ్యోతి** అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు . శుక్రవారం అన్ని శాఖల జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖలకు కేటాయించిన పనులను సమగ్ర ప్రణాళికతో అమలు చేసి లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, వైద్య ఆరోగ్య సేవల విస్తరణ, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు, అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం తదితర కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కోతులు, వీధి కుక్కల సమస్యలను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ సమస్యల పరిష్కారానికి 24 గంటల కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ టాక్స్ వసూళ్లను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. రహదారుల భద్రతను మెరుగుపరచేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని, విద్యార్థులకు అందించే భోజన వసతులపై కూడా అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై ప్రతిరోజూ నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు యూరియా ఎరువుల సమర్థ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాల్య వివాహాలను నిరోధించేందుకు బాల్య వివాహాలు బ్రతుకు ఆగం కార్యక్రమం కింద విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. మహిళా సాధికారత దిశగా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, మొక్కలు నాటడం, స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరు, ప్రతి మహిళను స్వయం సహాయక సంఘ సభ్యురాలిగా చేర్చే కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలన్నింటినీ సమర్థవంతంగా అమలు చేయడానికి సంబంధిత శాఖల అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమాల అమలును జిల్లా స్థాయిలో స్వయంగా పర్యవేక్షిస్తామని, అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పాల్గొని ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు.



2 లో..

# మండుతున్న ఎండలు

- జిల్లాలో 38 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- బయటకు రావాలంటే భయపడుతున్న జనం
- ఎండ తీవ్రత ఇంకా పెరిగే అవకాశం.

జిల్లాలో ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం పది గంటల నుంచే ఎండ తీవ్రత పెరిగిపోతుండగా మధ్యాహ్నం సమయంలో బయటకు రావడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా మే నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అయితే ఈసారి మార్చి నెలలోనే 38.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

• భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాజ్యోతి

# ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల పనితీరును ప్రశంసించిన మంత్రి

**ఇల్లందు, మార్చి 6, ప్రజాజ్యోతి:** ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల పనితీరును రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రశంసించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్ష సమావేశంలో ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు అందించాల్సిన సేవ గురించి మాట్లాడుతూ ఇల్లందు వైద్యశాల పనితీరు చాలా సంతృప్తికరంగా ఉందని, గిరిజన ప్రాంతంలో ఇలాంటి వైద్య సర్వీసులు అందించాలన్నది ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలను చూసి మిగిలిన వైద్యశాలలు నేర్చుకోవాలని కోరారు. వైద్యుల పర్యవేక్షణ, రోగులపట్ల నిబద్ధతతో ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, సిబ్బంది నిరంతరం కృషిచేయడం జరుగుతుందని కొనియాడారు.



# శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలసెక్టార్ టిక్కెట్లు, పరోక్ష సేవల బుకింగ్‌కు అవకాశం



**భద్రాచలం, మార్చి 6:** భద్రాచలంలో నిర్వహించనున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం సెక్టార్ టిక్కెట్లు , పరోక్ష సేవల బుకింగ్‌కు దేవస్థానం ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వహణాధికారి కె. దామోదర్ రావు తెలిపారు.ఈ ఏడాది శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు మార్చి 19 నుంచి ఏప్రిల్ 2 వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మార్చి 27న శ్రీసీతారామచంద్ర స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవం, మార్చి 28న పట్టాభిషేక మహోత్సవం జరగనున్నాయి. ఈ ఉత్సవాలను ప్రత్యక్షంగా వీక్షించదలచిన భక్తుల కోసం సెక్టార్ టిక్కెట్లు అందుబాటులో ఉంచారు. తిరుకళ్యాణ మహోత్సవానికి ఉభయ దాతలకు రూ.7,500 కాగా, ఇతర సెక్టార్ టిక్కెట్లు రూ.2,500, రూ.2,000, రూ.1,000, రూ.300, రూ.150గా నిర్ణయించారు. పట్టాభిషేక మహోత్సవానికి

మిగతా 2 లో...

## శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలసెక్టార్ టిక్కెట్లు, పరోక్ష సేవల బుకింగ్‌కు అవకాశం

(మొదటి పేజీ తరువాయి...)

రూ.1,500,రూ.500,రూ.100 టిక్కెట్లు అందుబాటులో ఉంటాయి. మార్చి 15 నుంచి భక్తులు నేరుగా టిక్కెట్లు పొందేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయం మెయిన్ టిక్కెట్ కౌంటర్, తానీషా కళ్యాణ మండపం (సి.ఆర్.ఓ.), బ్రిడ్జ్ పాయింట్ సి.ఆర్.ఓ., భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయాలలో టిక్కెట్లు విక్రయించబడతాయి. అలాగే ఉత్సవాలకు హాజరుకాలేని భక్తుల కోసం పరోక్ష సేవలను కూడా ఆన్లైన్‌లో అందుబాటులో ఉంచారు. భక్తులు తమ గోత్రనామాలతో పరోక్షంగా కళ్యాణం జరిపించుకునేందుకు రూ. 5,000 మరియు రూ.1,116 సేవలు అందుబాటులో ఉన్నాయి. సెక్టార్ టిక్కెట్లు మరియు పరోక్ష సేవలను దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ https://bhadradritemple.telangana.gov.in ద్వారా ముందస్తుగా బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు. ఆన్లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసిన భక్తులు తమ ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపించి తానీషా కళ్యాణ మండపం లోని సి.ఆర్.ఓ. కార్యాలయంలో ఒరిజినల్ టిక్కెట్లు పొందవచ్చని అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. దామోదర్ రావు కోరారు.

## ఇసుక దోపిడీని అరికట్టాలి

- పట్టా భూముల పేరుతో అక్రమ తవ్వకాలు
- గోదావరి ఇసుకాసురులకు అధికారుల అండదండలు
- ఇసుక క్వారీలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి
- అక్రమ తవ్వకాలపై చర్యలకు అక్షర మహిళా మండలి డిమాండ్



**మణుగూరు, మార్చి 06, (ప్రజాజ్యోతి) :** మండల పరిధిలోని సాంబాయిగూడెం గోదావరి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, పట్టా భూముల పేరుతో గోదావరిలో అక్రమ మైనింగ్ చేస్తున్నారని, ఇసుక దోపిడీని అరికట్టాలని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ ఆరోపించారు. శుక్రవారం స్థానిక రేణుక అక్షర మహిళా మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పంటలు పండుతున్న భూముల పేరున ఇసుక తవ్వకాలు చేపట్టవచ్చని అనుమతులు ఇచ్చిన రెవిన్యూ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇసుక మేటలే లేని భూములకు అనుమతులు పొంది, గోదావరి నదిలో సుమారు 25 అడుగుల వరకు లోతుగా, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక ర్యాంపులను వెంటనే మూసివేయాలని అన్నారు. సాంబాయిగూడెంలో జరుగుతున్న అక్రమ ఇసుక క్వారీలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి గోదావరిలో జరుగుతున్న అక్రమ మైనింగ్ ను నిలిపివేయాలని తెలిపారు. ఇంతకు ముందు గోదావరిలో జరిపిన ఇసుక తవ్వకాలకు కూడా జరిమానా విధించాలని సరోజ డిమాండ్ చేశారు. సాంబాయిగూడెం వద్ద జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై టిజిఎండిసి జిల్లా అధికారులు, రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు ఎండి షబానా, కోరి శ్యామల, కన్నాపురం వసంత, దేరంగుల సుజాత, రెడ్డిబోయిన రేణుక, లక్కింశెట్టి హేమలత, సౌజన్య డాకూరి, తదితరులు పాల్గొన్నారు.



- జిల్లాలో 38 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- బయటకు రావాలంటే భయపడుతున్న జనం
- ఎండ తీవ్రత ఇంకా పెరిగే అవకాశం.

# మండుతున్న ఎండలు

**జిల్లాలో ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం పది గంటల నుంచే ఎండ తీవ్రత పెరిగిపోతుండగా మధ్యాహ్నం సమయంలో బయటకు రావడానికి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. సాధారణంగా మే నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అయితే ఈసారి మార్చి నెలలోనే 38.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.**

● భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాజ్యోతి

ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### ››› భూగర్భజలాలపై ప్రభావం///

ఎండల ప్రభావంతో భూగర్భ జలాల మట్టం క్రమంగా తగ్గుతోంది. గోదావరి నదిలో నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో పరివాహక ప్రాంతాల్లో బోర్లు మరింత లోతుకు వెళ్లే పరిస్థితి ఏర్పడుతోంది. దీని ప్రభావం వ్యవసాయంపై పడే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ››› సింగరేణి కార్మికులకు ఇబ్బందులు//

కొత్తగూడెం, ఇల్లందు, కోయగూడెం, మణుగూరు ప్రాంతాల్లోని సింగరేణి గనుల్లో పనిచేస్తున్న కార్మికులు ఎండల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఫస్ట్ షిఫ్ట్, మిడిల్ షిఫ్ట్‌లలో విధులు నిర్వహించే కార్మికులు ఎండ తీవ్రతకు గురవుతున్నారు. పనివేళల్లో మార్పులు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### ››› విద్యార్థులకు ఇబ్బందులు//

పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో పరీక్షలు ముగిసిన తరువాత మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్లే విద్యార్థులు ఎండ వేడిమిని తట్టుకోవాల్సి వస్తోంది.

### ››› జాగ్రత్తలు పాటించాలి//

ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం, తరచూ నీరు తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం అవసరమని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఎండలో ఎక్కువసేపు ఉండకూడదని హెచ్చరిస్తున్నారు.



## జిల్లాలో ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వర్లు

**కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి 6, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 7,605 మంది విద్యార్థులు కేటాయించగా, 7,435 మంది హాజరయ్యారనీ, 170 మంది గైర్హాజరయ్యారనీ తెలిపారు, పరీక్షల సందర్భంగా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు, నేడు జరిగే పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు .

## మంత్రిని కలిసిన చైర్ పర్సన్



**ఇల్లందు, మార్చి 6, ప్రజాజ్యోతి:** ఖమ్మంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని శుక్రవారం ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా మంత్రి పొంగులేటి తీసుకుంటున్న ధైర్యమైన నిర్ణయాలు ప్రజలలో మరింత నమ్మకాన్ని కలిగిస్తున్నాయన్నారు.. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం మంత్రి పొంగులేటి ప్రత్యేక దృష్టి సారించడం సంతోషకరమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి సహకారం ఎంతో ఉందని కొనియాడారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సైతం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం మంత్రి ఇల్లందు మున్సిపాలిటీని అన్ని రంగాలలో అగ్రభాగాలలో నిలిపేందుకు నిరంతరం కృషి చేయాలని చైర్ పర్సన్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్ తదితరులు పాల్గొన్నారు.

# తునికాకు సేకరణ పై ప్రభుత్వం చిన్న చూపు..

- వేసవికాలంలో గిరిజన ప్రజలకు ఆదాయ వనరుగా ఉపయోగపడుతున్న తునికాకు
- తునికాకు సేకరణపై ఆదాయం కోల్పోతున్న గిరిజన, గిరిజనేతర పేదలు







**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 6,ప్రజాజ్యోతి:** తెలుగు రాష్ట్రాలలో ముఖ్యంగా ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో వేసవికాలంలో తునికాకు సేకరణ గిరిజన, గిరిజనేతరులకు ఒక ప్రధాన జీవనోపాధిగా వస్తుంది, తునికాకు సేకరణ కోసం ఫారెస్ట్ అధికారులు ఆన్లైన్ టెండర్ల ద్వారా టెండర్లను ఖరారు చేస్తుంటారు, గిరిజనులకు ఎంతో ఉపాధి కలిగించే తునికాకు ముఖ్యంశాలకు వస్తే వేసవిలో స్థానిక గిరిజనులకు ఏజెన్సీ వాసులకు ఈ సేకరణ ముఖ్యమైన ఆదాయ మార్గంగా వస్తుంది, 2026 సీజన్ కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 16,900 బస్తాలకు టెండర్లు కూడా పూర్తయ్యాయి, కొన్ని ప్రాంతాల్లో బోనస్ రాకపోవడం, సక్రమంగా చెల్లింపులు జరగకపోవడం వల్ల గిరిజనులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు, ఇది వారికి పెద్ద సమస్యగా తయారవుతుంది, తునికాకు సేకరణ ప్రక్రియ మొత్తం అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు, ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి కాలంలో తునికి మోడెం కొట్టించడం వలన మార్చి, ఏప్రిల్ మాసాలలో నాణ్యమైన తునికాకు వస్తుంది. పల్లె గ్రామాలలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో ఎక్కువ మంది గిరిజన, గిరిజనేతర పేదలు తునికి ఆకు సేకరించి ఒక్కో కుటుంబానికి 20 నుండి 50 వేల రూపాయలకు పైగా ఆదాయం పొందుతారు. అంతేకాకుండా కాంట్రాక్టర్లకు ప్రభుత్వానికి కూడా కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. ఫారెస్ట్ అధికారులు, కాంట్రాక్టర్లు తునికి ఆకు సేకరణ సమయంలో సకాలంలో తునికి మోడెం కొట్టించి, తునికాకు సేకరణ కార్మికులకు కట్టకు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం వలన ఏడాది– ఏడాదికి తునికి ఆకులు సేకరించడంలో కార్మికులు కూడా వెనకడుగు వేస్తున్నారు, అదేవిధంగా తునికి ఆకు సేకరణ సమయంలో ఆకు సేకరణ కార్మికులకు వడదెబ్బ తగిలినా... విషపు క్రిమి కీటకాల వలన లేదా అడవి జంతువుల వలన ప్రమాదాలు సంభవించి గాయాల పాలైనా... , ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వం తగు సహాయక చర్యలు తీసుకోకపోవడం వలన కూడా ఆకు సేకరణ కార్మికులు తగ్గుముఖం పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తునికి ఆకు సేకరణ పై దృష్టి సారించాలని, తునికి ఆకు కట్టకు గిట్టుబాటు ధర కట్టకు 5/– రూపాయలకు తగ్గకుండా ఇవ్వాలని. వేసవికాలం ప్రారంభమైంది కావున తునికి మోడెం కొట్టించాలని. కళ్ళేదారులకు, గుమస్తాలకు 25 శాతం అదనంగా కమిషన్ పెంచి ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో 62వ వార్షికోత్సవ వేడుకలు

- పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలి
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 6,ప్రజాజ్యోతి:** అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో 62వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు గుత్తెన శంకర్ మహదేవన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సాధనలను ఆదర్శంగా తీసుకుని చదువులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. కృషి, పట్టుదలతో ముందుకు సాగితే జీవితంలో మంచి స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చదివి వివిధ రంగాల్లో ఎదిగిన పూర్వ విద్యార్థులు బోయినపల్లి కవిత, కె లక్ష్మి, చ సునీత, వేముల రామారావులను సన్మానించారు. అలాగే క్రీడా, సాంస్కృతిక పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యా విషయాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం 20 వేల రూపాయల నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డిగూడెం సర్పంచ్ సున్నం నాగభూషణం, ఉప సర్పంచ్ వేముల నరేష్, పుర ప్రముఖులు వేముల రమణ, గఫర్, పాఠశాల సంక్షేమ సమితి అధ్యక్షుడు మోహన్ రావు, ఉపాధ్యాయులు సునంద రెడ్డి, శాంత కుమారి, రాజ్యలక్ష్మి, బాబూరావు, బీవీ, ప్రమీల రాణి, సుశీల, బాలూ, పద్మ, మోతిలాల్, జయరాం, ప్రసాద్, మీరా సాహెబ్, శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.







## మహిళను వేధించిన కేసులో జైలు శిక్ష

**ఇల్లందు, మార్చి 6, ప్రజాజ్యోతి:** 2018లో ఓ మహిళను వేధించిన కేసులో ఎర్పుల కృష్ణ అనే వ్యక్తికి ఏడాదిన్నర జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఇల్లందు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ అనిల్ కుమార్ వాదించారు. కోర్టు సీడిఓ సురేష్, కోర్టు పోలీస్ సిబ్బంది అనంతరాములు వ్యవహారించారు.

## మాజీ పరిషత్ చైర్మన్ గోనెల విజయలక్ష్మి పాడె మోసిన ఎమ్మెల్యే కోరం



**టేకులపల్లి,మార్చి06,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం ప్రేగల్లపాడు పంచాయతీ తెలగనూరు గ్రామం గ్రామానికి చెందిన జిల్లా మాజీ పరిషత్ చైర్మన్ గోనెల విజయలక్ష్మి గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం వారి స్వగ్రామానికి చేరుకొని గుండెపోటుతో మరణించిన గోనెల విజయలక్ష్మి భౌతికకాయానికి పూలమాల వేసిఘన నివాళులు అర్పించించారు.వారి అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.భావోద్వేగానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య గురయ్యారు.వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ తన రాజకీయ గురువుగారైన గోనెల నారాయణ సతీమణి విజయలక్ష్మి జిల్లా ప్రజలకు అనేక సేవలు అందించారాని,భర్తను,కొడుకును కోల్పోయినప్పటికి అనేక ఒడి దుడుకులను ఎదుర్కొని రాజకీయాల్లో అత్యునత స్థాయి జిల్లా పరిషత్ చైర్మన్ గా వారు ప్రజలకు అంచించిన సేవలను స్మరిస్తూ తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఈకార్యక్రమంలో డిసిసి ప్రెసిడెంట్ తోట దేవి ప్రసన్న,ఎమ్మెల్యే సతీమణి కోరం లక్ష్మి ,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ – ఉమా ,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ జడ్పీ చైర్ పర్సన్ కు ఘన నివాళులు

**ఇల్లందు టౌన్, మార్చి 6, ప్రజాజ్యోతి:** ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు గోనెల విజయలక్ష్మి గుండెపోటుతో మృతి చెందగా, ముత్యాలంపాడు గ్రామంలోని వారి స్వగృహంలో మృతదేహానికి శుక్రవారం ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గోనెల విజయలక్ష్మి ప్రజా సేవలో నిబద్ధతతో పని చేశారని, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజల అభివృద్ధికి చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇల్లందు పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి – ప్రగతి ప్రణాళికలో పాల్గొన్న సర్పంచులు

- మార్చి 6 నుండి 12 వరకు గ్రామపంచాయతీలలో ప్రత్యేక కార్యక్రమాలు
- గ్రామపంచాయతీ కార్యాలయాలు పరిశుభ్రం, చెత్త సేకరణ

**పినపాక,మార్చి 06(ప్రజాజ్యోతి):** ప్రజావాణి – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పినపాక మండలంలోని గ్రామపంచాయతీలలో సర్పంచులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. మార్చి 6 నుండి 12 వరకు గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రత, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంకీర్త్, ఎంపీ ఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయాలను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టి పరిసర ప్రాంతాలలో చెత్తను సేకరించారు. గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలు కూడా సహకరించాలని అధికారులు సూచించారు. పొట్లపల్లి జానంపేట గ్రామపంచాయతీలలో సర్పంచులు సమ్మయ్య, ఉమామహేశ్వరి, గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పారిశుద్ధ్య ప్రతిజ్ఞ చేశారు .

# భద్రాచలంలో ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు

- బంజారా జాతి ఐక్యతకు సేవాలాల్ మహారాజ్ మార్గదర్శి : ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 6,ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలో బంజారా జాతి ఆరాధ్య దైవం, మహనీయుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ, భద్రాచలం నియోజకవర్గ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.<ఈ సందర్భంగా నిర్వహించిన భోగ్ బండారో, వింతీ కార్యక్రమాల్లో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన అతిథులకు కమిటీ సభ్యులు బంజారా సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి భోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భారతదేశం మహనీయుల పుట్టినిల్లు అని, బంజారా జాతిని ఒకే తాటిపై నడిపించి ఐక్యతకు పునాది వేసిన గొప్ప మహానుభావుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ బంజారా జాతి అభివృద్ధి కోసం ప్రతి గిరిజన యువకుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. లంబాడీలు సేవాలాల్ మహారాజ్‌ను తమ ఆరాధ్య దైవంగా భావించి పూజిస్తారని పేర్కొన్నారు. జంతు బలికి తీవ్రంగా వ్యతిరేకించిన సేవాలాల్ మహారాజ్ తల్లిదండ్రులను, మహిళలను గౌరవించాలని ప్రజలకు బోధించారని తెలిపారు. ప్రకృతిని, వన్యప్రాణులను పరిరక్షిస్తూ సద్గుణాలతో జీవించాలనే సందేశాన్ని ఆయన ఇచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మాట్లా డుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారని అన్నారు. చత్రపతి శివాజీ, గురు నానక్, గౌతమ బుద్ధుడు వంటి మహనీయులు సమాజ అభ్యున్నతికి కృషి చేసినట్లే, బంజారా జాతి అభివృద్ధి కోసం సేవాలాల్ మహారాజ్ విశేషంగా కృషి చేశారని తెలిపారు. సంచార జీవితం గడిపిన బంజారా తెగలను తండాల జీవన విధానానికి తీసుకువచ్చి సమాజంలో స్థిరపరిచిన గొప్ప సంఘ సంస్కర్తగా ఆయన నిలిచారని చెప్పారు. మద్యం, మాంసాహారం వంటి చెడు అలవాట్లను మానుకోవాలని ప్రజలకు బోధిస్తూ బంజారా సమాజంలో నైతిక విలువలను పెంపొందించడానికి సేవాలాల్ మహారాజ్ కృషి చేశారని అన్నారు. దేశవ్యాప్తంగా కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నివసిస్తున్న బంజారా జాతి ప్రజలకు ఆయన స్ఫూర్తిదాయకుడిగా నిలిచారని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలన సమయంలో కూడా మతమార్పిడులను వ్యతిరేకించి బంజారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడిన మహనీయుడిగా ఆయన చరిత్రలో నిలిచారని వివరించారు. 1739 ఫిబ్రవరి 15న ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని సేవాగడ్ (రామచంద్రపురం) గ్రామంలో జన్మించిన సంత్ సేవాలాల్ మహారాజ్ అహింస, శాంతి, మానవత్వం వంటి విలువలను ప్రజల్లో పెంపొందించారని తెలిపారు. మూఢనమ్మకాలను విడనాడాలని, ప్రకృతిని ప్రేమించాలని, మహిళలను గౌరవించాలని ఆయన ప్రజలకు హితబోధ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భద్రాచలం జడ్జి శివ నాయక్, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అశోక్, భద్రాచలం తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, పీవీటీజీ అధికారి గన్యా, బంజారా సంఘం నాయకులు భూక్యా రంగా, లకావత్ వెంకటేశ్వర్లు, బంసీలాల్, మోహన్‌లాల్, గోవింద్, భూక్యా రంజిత్, రాందాస్, భూక్యా సాయి కౌశిక్, నాగులు, వంకుదోత్ కృష్ణ, బిక్ష, సైదులు, శీతల్ నాయక్, మోహన్ నాయక్, కోటి, జుంకీలాల్, సీతయ్య నాయక్, మదన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే భద్రాచలం నియోజకవర్గంలోని వివిధ తండాల నుంచి పెద్ద సంఖ్యలో బంజారా సోదరు లు, సోదరీమణులు హాజరై సంత్ సేవాలాల్ మహారాజ్‌కు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమం భక్తి వాతావరణంలో నిర్వహించబడింది

## షెడ్యూల్ ప్రకారం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక ను అన్ని పాఠశాలలలో అమలు చేయాలి..

- జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్స్.



**టేకులపల్లి,మార్చి06,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల,కేజీబీవీ పాఠశాలలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్స్ సందర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల అనుసారం మార్చి 06 వ తేదీ నుండి మార్చి 15 వ తేది వరకు ప్రజాపాలన –ప్రగతి ప్రణాళికను ప్రతీ పాఠశాలలో అమలు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వారు సూచించారు.షెడ్యూల్ ప్రకారం ప్రతి రోజు స్టాఫ్ మీటింగ్ ను ఏర్పాటు చేసి, కమిటీ ఏర్పాటు చేసుకొని,స్పెషల్ డ్రైవ్ లు పాఠశాలల్లో చేయవలసిన పనులపై సమీక్ష నిర్వహించుకొని ప్రోగ్రామ్ ను ప్రారంభించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ముఖ్యంగా పరిశుభ్రత,పారిశుధ్యం, సంస్థాగత నిర్వహణ పరిపాలన సామర్థ్యం వంటి విషయాలపై శ్రద్ద వహించి కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజ శేఖర్,కమ్యూనిటీ మోబిలైజేషన్ అధికారి యస్. కె. సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్.సతీష్ కుమార్,ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నరు.

## భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 6,ప్రజాజ్యోతి :** భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పు వెలువరించారు.చుంచుపల్లి మండలం విద్యానగర్‌కు చెందిన లాకవత్ సైదులు తన పెద్ద కుమార్తె స్నేహను ఖమ్మం జిల్లా (ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా) గార్ల మండలం పుల్లూరు గ్రామం కట్టుకుంట తండాకు చెందిన భూక్య శ్రీధర్‌కు 2021 జూలై 30న వివాహం చేశారు. వివాహం జరిగిన కొద్ది రోజుల పాటు దంపతుల జీవితం సజావుగానే సాగింది. అనంతరం భర్త శ్రీధర్‌తో పాటు అత్త మామలు వేధింపులకు గురిచేస్తున్నారని స్నేహ తల్లిదండ్రులకు తెలిపింది. కొన్నిసార్లు ఆమెను పుట్టింటికి పంపించగా, కుటుంబ సభ్యులు సర్దిచెప్పి తిరిగి భర్త ఇంటికి పంపించారు. అయినా పరిస్థితుల్లో మార్పు రాకపోవడంతో స్నేహ కొంతకాలం పుట్టింటిలోనే ఉండసాగింది. 2023 మే 20న ఉదయం 11 గంటల ప్రాంతంలో భూక్య శ్రీధర్ పెట్రోల్‌తో వచ్చి స్నేహపై పోసి నిప్పంటించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయాన్ని స్నేహ చెల్లెలు నీల పక్కింటి వ్యక్తి సెల్‌ఫోన్ ద్వారా తన తల్లికి తెలియజేసింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని తీవ్రంగా కాలిన గాయాలతో ఉన్న స్నేహను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై బాధితురాలి తండ్రి లాకవత్ సైదులు చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కె. సుమన్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి ఇన్‌స్పెక్టర్ ఎ. రమాకాంత్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.విచారణలో భాగంగా కోర్టు 17 మంది సాక్షులను విచారించింది. విచారణలో భూక్య శ్రీధర్‌పై నేరం రుజువుకావడంతో అతనికి జీవిత ఖైదు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు పేర్కొంది. అయితే అత్త భూక్య అచ్చమ్మ, మామ భూక్య బాసు అలియాస్ భాస్కర్‌లపై నేరం రుజువు కాలేదని కోర్టు కేసు నుంచి విముక్తి కల్పించింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వి.డి. లక్ష్మి వాదనలు వినిపించారు. కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్సై డి. రాఘవయ్య, కోర్టు లైజాన్ ఆఫీసర్ ఎన్. వీరబాబు, హెడ్ కానిస్టేబుళ్లు లచ్చా, పి. సుమన్ తదితరులు సహకరించారు

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

- విజయవంతం చేయడానికి కృషి చేస్తా.
- ఎంపీడీవో ముత్యాలరావు





**అశ్వాపురం, మార్చి 6, ప్రజా జ్యోతి దినపత్రిక** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం పరిధిలోని గొందిగూడెం గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యచరణ మీద గౌరవనీయులైన ఎంపీడీవో _ముత్యాల రావు గ్రామపంచాయతీనీ సందర్శించి సమావేశం నిర్వహించి ఈ ప్రగతి ప్రణాళిక మీద మార్చి 6 నుండి జూన్ 12 వరకు చేయవలసిన పనులు మీద తగు సూచనలు చేసి ప్రజా పాలన _ప్రగతి ప్రణాళిక మీద ఈ సమావేశానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాటి వెంకట లక్ష్మి మరియు పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ రావు హెల్త్ డిపార్ట్మెంట్ అంగన్వాడి టీచర్స్ స్కూల్ హెడ్ మాస్టర్ పాల్గొనడం జరిగింది

## నేటి నుంచి జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ప్రారంభం

**ఇల్లందు, మార్చి 6, ప్రజాజ్యోతి:** కోరం పుల్లయ్య– సింగమ్మ మెమోరియల్ ఇన్విటేషన్ల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో నేటి నుంచి జెకె కాలనీలోని సింగరేణి క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్ 7, 8 తేదీలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి విన్నర్ కు రూ. 10వేలు, షిల్డ్, రన్నర్ కు రూ. 5వేలు, షిల్డ్, బెస్ట్ షాట్ ట్రోఫీ, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ట్రోఫీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి...

- - మహిళా ఉద్యోగులకు, కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు
- - జిఎం(పర్సనల్) వెల్ఫేర్& సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్





**కొత్తగూడెం సింగరేణి, మార్చి 6 – ప్రజాజ్యోతి:** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, ఈ ఆటల పోటీలలో అత్యధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు, కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగులు పాల్గొనడం చాలా సంతోషం అని జిఎం(పర్సనల్) వెల్ఫేర్& సిఎస్ఆర్ శ్రీ జి.వి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఈఈ & ఆర్సి శ్రీ ఏజేఎం మురళీధర రావు లు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో సింగరేణి ప్రధాన కార్యాలయము లో కార్పొరేట్ ఏరియా పరిధిలోని అన్ని డిపార్ట్మెంట్ల నందు పనిచేసే మహిళా అధికారులకు, ఉద్యోగులకు, అప్రెంటిస్ ఉద్యోగులకు , మహిళా కాంట్రాక్ట్ కార్మికులకు శుక్రవారం నాడు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తూ మహిళలను ప్రోత్సహిస్తుందని అన్నారు. దీనిలో భాగంగా కార్పొరేట్ ఏరియా పరిధిలోని మహిళా అధికారులకు, ఉద్యోగులకు , మహిళా కాంట్రాక్ట్ కార్మికులకు, అప్రెంటిస్ ఉద్యోగులకు బాంబ్ ఇన్ సిటీ, పాసింగ్ బాల్ మరియు మ్యూజికల్ చైర్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలలో గెలుపొందిన మహిళా ఉద్యోగులకు మార్చి 10 వ తేదీన సాయంత్రం 3 గంటల నుండి సింగరేణి ప్రధాన కార్యాలయ హెచ్ఆర్డి కాన్ఫరెన్స్ హాల్ నందు జరిగే మహిళ దినోత్సవ వేడుకలలో బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమములో జిఎం(పర్సనల్) వెల్ఫేర్& సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఈఈ & ఆర్సి ఏజేఎం మురళీధర రావు, డిజిఎం(పర్సనల్) కేసా నారాయణ రావు, ఉమెన్స్ డే ఆర్గనైజర్స్ బి. సుమలత, కే.రమ, డి.శారద జిబి. అరుణకుమారి, బి.ప్రియాంక, ఏ.అరుణకుమారి, ఎం.సౌమ్య, టి.శాంత, కార్పొరేట్ ఏరియా మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మహిళలు చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సభ






**భద్రాచలం, మార్చి 6,ప్రజాజ్యోతి :** రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులు, చట్టాలపై మహిళలు అవగాహన పెంపొందించుకోవాలని ప్రముఖ న్యాయవాది శుభశ్రీ అన్నా రు. సమస్యలు ఎదురైనప్పుడు మౌనం గా ఉండకుండా ధైర్యంగా స్పందిస్తూ హక్కుల కోసం పోరాడాలని సూచించారు. శుక్రవారం భద్రాచలం పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ఆవరణలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పట్టణ కార్యదర్శి డి. సీతాలక్ష్మి, శ్రామిక మహిళా నాయకురాలు చంద్రలీల అధ్యక్షత వహించారు.విద్యార్థి దశ నుంచే మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం అవసరమని శుభశ్రీ పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే సభలు,సమావేశాలు మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించే వేదికలుగా మారాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి మాట్లాడుతూ, మహిళలను వంటింటికే పరిమితం చేయాలని చేసే ప్రయత్నాలను మహిళలు ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మహిళలను కేవలం ఒక వస్తువుగా చూడటం దుర్మార్గమని, మహిళలపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు మహిళలు చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గ్రామ గ్రామాన నిర్వహిస్తూ మహిళలను చైతన్యపరుస్తున్నామని తెలిపారు. సిఐటియు శ్రామిక మహిళా కన్వీనర్ జిలకర్ర పద్మ మాట్లాడుతూ, కొత్త లేబర్ కోడ్ల వల్ల మహిళా కార్మికులకు రక్షణ తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత వంటి అంశాలు మహిళా కార్మికులకు కీలకమని, కార్మిక చట్టాలలో మార్పుల వల్ల స్కీమ్ వర్కర్లపై అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు. మహిళా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సంఘటితంగా పోరాటాలు నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మూడు రోజులపాటు మహిళా సదస్సులు, సెమినార్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకులు నాదెండ్ల లీలావతి, జిల్లా కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి పూర్ణిమ, ఉస్తేల జ్యోతి, జీవన జ్యోతి, అనసూయ, సిఐటియు మహిళా నాయకురాలు కొలగాని స్వరాజ్యలక్ష్మి, న్యాయవాది కొరడా పుష్పలత, నాయకులు కనకశ్రీ, సక్కుబాయి, సౌభాగ్యం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు, యువతులు, విద్యార్థినిలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఫేర్వెల్ డే వేడుకలు



**బూర్గంపహాడ్, మార్చి6 (ప్రజా జ్యోతి):** మండలంలోని మోరంపల్లి బంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమం అలరించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు 9వతరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని జీవితములో ఉన్నత స్థానాలలో స్థిరపడాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచిపేరు తేవాలని తెలిపారు.పరీక్షలు మంచిగా రాసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాల్వంచలో బంజారా భవన నిర్మాణానికి స్థల పరిశీలన.



**పాల్వంచ మార్చి 6, ప్రజాజ్యోతి:** మండల పరిధిలోని కేపీ జగన్నాధపురం గ్రామ పంచాయతీ శివారులో బంజారా కమ్యూనిటీ భవన నిర్మాణానికి శుక్రవారం గ్రామ పెద్దలు మరియు వివిధ సంఘాల నాయకులు స్థల పరిశీలన చేశారు. లంబాడ సామాజిక వర్గ ప్రజల అవసరార్థం, వారి సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఎర్త్ గ్రీన్ సొసైటీ వ్యవస్థాపకులు రమేష్ రాథోడ్ మాట్లాడుతూ.. బంజారా కమ్యూనిటీ భవనం ద్వారా ఈ ప్రాంత గిరిజనులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, దీని నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు. స్థల పరిశీలన చేసిన వారిలో నంగారభేరి లంబాడి హక్కుల పోరాట సమితి భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ కుశ నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు బద్రు నాయక్, నాయకులు రవి నాయక్, సిపిఐ గ్రామ కార్యదర్శి సీతారాం నాయక్, కళ్యాణ్ ధర్మసోత్, రాములు ధర్మసత్, సేవియా ధర్మసోత్, రమేష్, ప్రసాద్, చందు నాయక్, లక్ష్మణ్ నాయక్, మంజా నాయక్, లోక్యా నాయక్, చాంప్లా నాయక్, బాబు నాయక్, మాలు నాయక్, మూడు బిచ్చ, హేమన, సాధు తదితరులు పాల్గొన్నారు.

# 9న ఐటిఐ విద్యార్థులకు అప్రెంటిస్ షిప్ మేళా



**బూర్గంపహాడ్, మార్చి6 (ప్రజా జ్యోతి):** ఈ నెల 9న ప్రభుత్వ ఆర్.ఐ.టి.ఐ కృష్ణ సాగర్ లో అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహించనున్నట్లు స్థానిక ఐటీఐ ప్రిన్సిపాల్ ధర్మచారి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ అప్రెంటిషిప్ మేళకు టి.కే.ఐ ఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చర్లపల్లి, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ నాచారం కంపెనీ ప్రతినిధులు హాజరు కానున్నారని, మేళాలో ఐటీఐ పాస్ అయిన విద్యార్థులకు అప్రెంటిస్ షిప్ ఇప్పించబడుతుందన్నారు. విద్యార్థులు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసి ఫారం, ఒరిజినల్, జిరాక్స్ ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు హాజరుకావాలన్నారు.

## అక్రమణలపై కన్నెర్ర...

- ప్రధాన రహదారి వెంట షాపులకు నోటీసులు
- రోడ్డు నుంచి 55 అడుగుల వరకు ఉన్న ఆక్రమణలు తొలగించాలి



**ములకలపల్లి, మార్చి 06, ప్రజా జ్యోతి:** మండలంలోని జగన్నాధ పురం పంచాయతీలో ఆర్ అండ్ బి రహదారి వెంట ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. శుక్ర వారం రహదారి పక్కన ఉన్న షాపుల యజమానులకు ఆర్ అండ్ బి అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దమ్మపేట – పాల్వంచ ప్రధాన రహదారిలో కరెంట్ సబ్‌స్టేషన్ నుండి పెట్రోల్ బంక్ వరకు రహదారి ఇరువైపులా 55 అడుగులు, జగన్నాధపురం సెంటర్ నుండి జీపీ ఆఫీస్ వరకు రహదారి నుంచి 33 అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలను కూడా తొలగించాలని షాపుల యజమానులకు నోటీసు అందజేశారు. రోడ్డు విస్తరణ మరియు రహదారి పరిరక్షణ చర్యల్లో భాగంగా రహదారి పక్కన ఉన్న షాపుల యజమానులకు ముందస్తు నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 12 వ తేదీలోపు ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వైభవంగా వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం




**చర్ల, మార్చి 06:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం మండల కేంద్రంలోని సాయిన గర్ లో గల శ్రీ దత్తసాయి మందిర ప్రాంగణంలో ఈ నెల 8 వ తేదీన శ్రీ వారాహి అమ్మ వారి దివ్య విగ్రహ పత్రిష్ఠా మహోత్సవంలో భాగంగా మొదటి రోజు పూజా కార్యక్ర మాలు ఆలయ అర్చకులు పున్న మరాజు విజయ్ కుమార్ శర్మ, కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో వైభంగా సాగాయి. ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్య హవచనము, పరిషిత్, రిత్విక్ వరుణం, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, అఖండ దీపారాధన, అవాహన పూజ అనంతరం సాయంత్రం వేదస్వస్తి, అగ్ని మధనం, దేవతా హోమాలు జలాధివాసం, క్షీరాధివాసం, మండప పున:పూజ, నీరాజన మంత్ర పుష్పంలతో ముగిసాయి. రెండవ రోజున నేటి ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండవ పున:పూజ వారాహి యంత్రజపం, ఛండీ హోమం, నీరాజన మంత్రపుష్పం సాయంత్రం వేద స్వస్తి, దేవతా హోమాలు, ధాన్యాదివాసం, పుష్పాదివాసం, పంచశయ్యాదివాసం, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పాల పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. కార్యక్రమాన్ని కనులారా తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నేడు, రేపు జరిగే కార్యక్రమాలకు సైతం భక్తులు తరలిరావాలని అర్చకులు విజయకుమార్ శర్మ విజ్ఞప్తి చేసారు.



# చిన్నారి కి అండగా నిలిచిన జనం కోసం మనం సంస్థ

- మండల అధికారులు సిబ్బంది, మరియు పినపాక గ్రామ స్తులు
- చిన్నారి కుటుంబానికి రూ.42 వేల ఆర్థిక సహాయం

**అశ్వాపురం, మార్చి 6, ప్రజా జ్యోతి దినపత్రిక** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన రుత్విక్ (2) ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా తల్లిదండ్రులు వైద్య ఖర్చులకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతు దాతల సహాయం కోరగా అమ్మగారిపల్లి గ్రామపంచాయతీ పంచాయతీ కార్యదర్శి అజార్ ప్రత్యేక చొరవ తీసుకొని దాతలకు చిన్నారి పరిస్థితిని వివరించి విరాళాలు సేకరించారు. జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ వారు రూ. 20000, అశ్వాపురం మండలం అధికారులు సిబ్బంది, పినపాక గ్రామస్తుల ద్వారా సేకరించిన 22000 మొత్తం 42 వేల రూపాయలు శుక్రవారం ఖమ్మం లోని అంకుర్ ఆస్పత్రిలో చిన్నారి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ యూ డి సి పద్మావతి, అమ్మగారిపల్లి సర్పంచ్ ఇర్పా కవిత, పంచాయతీ కార్యదర్శులు వేణుప్రియ, ఎస్కే అజార్, దొడ్డ శరత్, జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రోహిత్ ఎస్.కె అజార్ ఎస్కే అంకుష్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.




## రైల్వే స్టేషన్‌లో విషాదం

- పెళ్లిరోజే రైల్వే ఉద్యోగి కరెంటు షాక్ తో మృతి



**మణుగూరు, మార్చి 06, (ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు రైల్వే స్టేషన్‌లో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. రైల్వే సిగ్నల్ విభాగంలో ఈఎస్ఎం గా పనిచేస్తున్న రంప నవీన్ (33) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు నవీన్ కొత్తగా కొనుగోలు చేసిన కారును నిలిపేందుకు సాయంత్రం పాత రన్నింగ్ రూమ్ వద్ద ఉన్న పెద్దను తొలగిస్తున్న సమయంలో అక్కడ ఉన్న విద్యుత్ వైర్ తగలడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన సాయంత్రం సుమారు నాలుగు గంటల ప్రాంతంలో జరిగిందని స్థానికులు తెలిపారు. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన నవీన్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. అత్యంత విషాదకరమైన విషయం ఏమిటంటే ఇదే రోజు నవీన్ పెళ్లిరోజు కావడం స్థానికులను మరింత కలిచివేసింది. మరోవైపు ఆయన భార్య ఆరు నెలల గర్భవతిగా ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనై కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ దుర్ఘటనతో ఒక్కసారిగా మణుగూరు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అధికారులు ఘటనపై మరింత సమాచారం సేకరిస్తున్నారని తెలుస్తోంది.

## మద్యం మత్తులో బైక్ ప్రమాదం ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు




**ఆళ్ళపల్లి. మార్చి6. ప్రజాజ్యోతి** అతిగా మద్యం సేవించి వాహనం నడపడం ఒకరి ప్రాణాన్ని బలి తీసుకోగా, మరొకరిని ఆసుపత్రి పాలు చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్ళపల్లి మండలం తిర్లపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. కరకగూడెం మండలం రేగళ్ల గ్రామానికి చెందిన గోత్తికోయ గిరిజనులు ముచ్చికి భద్రయ్య (30), భీమయ్య తమ బంధువుల ఇంటికి (ముత్తాపురం) వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మద్యం మత్తులో ఉండటంతో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో భద్రయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సమాచారం అందించగా, 108 అత్యవసర వాహనం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుంది. తీవ్రంగా గాయపడిన భీమయ్యకు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై సోమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు

## బాలాజీ ఆలయంలో హుండీ లెక్కింపు

- హుండీల ద్వారా రూ.5,34,196 ఆదాయం



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 6, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి లోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో శుక్రవారం హుండీలను తెరిచి లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మొత్తం రూ.5,34,196 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ భద్రాద్రి కొత్తగూడెం జోన్ ఇన్స్పెక్టర్ పి. బెల్ సింగ్, వి.వి. నరసింహారావు జాతర సిఎఫ్ఓ పాల్గొన్నారు. అలాగే అన్నపురెడ్డిపల్లి సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉప సర్పంచ్ మారగాని అశోక్ పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు బాలసాని శ్రీనివాస రావు, నేరెళ్ల లాలయ్య, బి. సత్యనారాయణ, మరకాల లక్ష్మారెడ్డి, శాంతమ్మ, శ్రీదేవి, ఇందిరాతో పాటు పలువురు భక్తులు హాజరయ్యారు. ఆలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ రామారావు, జూనియర్ అసిస్టెంట్లు నరసింహులు, సంపత్, రికార్డు అసిస్టెంట్ నరసింహారావు, పాశం వెంకటేశ్వర్లు, రాంసింగ్ పాల్గొన్నారు. స్వామివారి సేవలో ఆలయ మేనేజర్ పాకాల వెంకటరమణ సమన్వయం చేశారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



**ఆళ్ళపల్లి. మార్చి6. ప్రజాజ్యోతి** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి , తాసిల్దార్ కార్యాలయ ప్రాంగణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించారు. ఎంపీడీవో ధీరావత్ శ్రీను ఆదేశాల మేరకు, గ్రామ సర్పంచ్ వాసం సుస్మిత, పంచాయతీ సెక్రెటరీ శిరీష ఆధ్వర్యంలో ఈ పారిశుద్ధ్య డ్రైవ్‌ను చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పిచ్చి మొక్కలను తొలగించారు. వ్యాధుల నివారణ వ్యాపించకుండా, ప్రజలు మరియు సిబ్బంది ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.